RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -89 పేజీలు - 04 వెల - 04/- శనివారం 11 ఏప్రిల్ 2026



# అందరి దృష్టి చర్చలపైనే

**నేడే అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు**

**పటిష్టమైన భద్రత నడుమ పాకిస్తాన్ రాజధాని**

**లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం**

**హంగేరీ నుంచి ఇస్లామాబాద్‌కు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ బృందం**

**ఇస్లామాబాద్ :ఏప్రిల్ 10 ఆంధ్ర ప్రగతి**

శాంతి చర్చలకు ఇస్లామాబాద్ వేదికైంది. ఇప్పుడు అందరి దృష్టి చర్చలపైనే ఉంది. శుక్రవారం నాడే చర్చలు ప్రారంభమవుతాయని తొలుత ప్రకటించినా ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా శనివారం జరుగుతున్నాయి. ఇజ్రాయిల్ సైన్యం లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తున్నందున ఇరాన్ ప్రతినిధి బృందం శుక్రవారం బయలుదేరలేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ హంగేరీ నుండి ఇస్లామాబాద్‌కు పయనమయ్యారు. అంతకు ముందు జాయింట్ బేస్ ఆంద్రూస్‌లో మీడియాతో మాట్లాడుతూ "మేము సానుకూల చర్చలు జరపడానికి ప్రయత్నిస్తున్నాం, **మిగతా 2లో...**



# వైకాపా కుట్రలను తిప్పికొట్టండి

**కేబినేట్ ఎజెండా ముందే లీక్**

**కీలక అంశాలు సైతం ముందే వెల్లడి**

**గతంలో ఇలా జరిగితే ఎన్టీఆర్ కేబినెట్ రద్దు చేశారు**

**సమాచారం లీక్ అయితే అందుకు మంత్రులదే బాధ్యత**

**కేబినేట్ భేటీలో సీఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్**

**జలధార తదితర పథకాలపై ప్రచారం కల్పించాలని ఆదేశం**



**అమరావతి,ఏప్రిల్ 10 ఆంధ్ర ప్రగతి**

సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు 3 గంటలకు పైగా సాగింది. ఈ సమావేశంలో.. అమరావతికి ఆమోదంపై కేంద్రానికి, ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడంతో పాటు.. కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది కేబినెట్.. అయితే, ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం చంద్రబాబు.. కీలక సమాచారం లీక్ అవుతున్న అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండాతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు ముందుగానే బయటకు ఎలా వస్తున్నాయంటూ మంత్రులను ప్రశ్నించారు. ఇకపై క్యాబినెట్ సమావేశానికి ముందే ఎజెండా లీకైతే సంబంధిత మంత్రులే బాధ్యత వహించాల్సి **మిగతా 2లో...**

# ప్రాజెక్టులకు ఆమోదం

**రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం**

**క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో మూడు సంస్థల ఏర్పాటు**

**విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు**

**సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాలు**

**కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**

**అమరావతి,ఏప్రిల్ 10 ఆంధ్ర ప్రగతి**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొనసాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. **మిగతా 2లో...**

# యూపీలో పడవ బోల్తా... 10 మంది యాత్రికులు మృతి..

**. ప్రధాని మోదీ దిగ్భ్రాంతి-మధురలోని యమునా నదిలో పడవ బోల్తా**

**14 మందిని కాపాడిన సహాయక బృందాలు**



**రాయలసీమ ప్రాజెక్టులను**

# చంపేసిన వైకాపా

**ఇప్పుడేమో మొసలి కన్నీరా**

**ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా?**

**మంత్రి పయ్యావుల కేశవ్ సవాల్**



**అమరావతి,ఏప్రిల్ 10 ఆంధ్ర ప్రగతి**

రాయలసీమ పేరును వైకాపా రాజకీయం కోసమే వాడుకుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టును చంపేసిన వైకాపా నాయకులు.. మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమన్నారు. వైకాపా హయాంలో ఆగిన ప్రాజెక్టును తామెలా ఆపగలమని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాటలను వైకాపా నేతలు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టును ఆపింది తామేనన్న బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాటలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాయలసీమకు ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మరోవైపు జగన్ నైజం చూసి..**మిగతా 2లో...**

# మావిగన్ పై ఐదేళ్లలో ఎందుకు మాట్లాడలేదు



**ఐదేళ్లలో రాజధాని కోసం ఒక్క ఇటుకైనా పేర్చారా**

**ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం మొదలు పెట్టారు**

**పులివెందులకు అవి గొడ్డలి పేరు పెట్టాలి**

**అమ్మ విజయమ్మకు బొత్స బహిరంగ క్షమాపణలు చెప్పాలి**

**మీడియా ముందు జగన్‌ను ఏకి పారేసిన వైఎస్ షర్మిల**

**విజయవాడ,ఏప్రిల్ 10 ఆంధ్ర ప్రగతి**

ఏపీ రాజధాని అమరావతికి జగన్ పేరుతో 'మావిగన్' సరే.. పులివెందులకు అవినాశ్ పేరుతో ' అవి గొడ్డలి' అని పెట్టాల్సిందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎద్దేవా చేశారు. జగన్ పేరులో గన్ ఉందని, అవినాశ్ పేరులో వినాశనం ఉందన్నారు. ' ఎంతసేపూ నరకాలి.. చంపాలి.. నాశనం చేయాలి'**మిగతా 2లో...**

# అమరావతి అవినీతి గని



**నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ అమరావతిపై సజ్జల విమర్శలు**

**అమరావతిలో సామాన్య ప్రజలు నివసించే పరిస్థితి లేదన్న సజ్జల**

**ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చెప్పలేకపోతున్నారని విమర్శ**

# సవాళ్లను స్వీకరించండి

**బెంగళూరు గ్రీన్‌వుడ్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో మంత్రి లోకేశ్**

**సవాళ్లను స్వీకరించి లక్ష్యంపై దృష్టి పెట్టాలని యువతకు సూచన**

**షార్ట్ కట్ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని ఉద్బోధ**



**ఏప్రిల్ 10 ఆంధ్ర ప్రగతి**

యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్‌ను అనుసరించకుండా నిర్దిష్ట లక్ష్యంపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని సర్జాపూర్‌లో ఉన్న గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ (గ్రేడ్-12) 2026 **మిగతా 2లో...**

# న్యాయ శాఖ పటిష్టత కోసం చర్యలు.

**..పబ్లిక్ లిటిగేషన్ పాలసీ- పై మంత్రి వర్గ ఉపసంఘం భేటి.**

**ఆంధ్ర ప్రగతి అమరావతి, ఏప్రిల్ 10:**



రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళికబద్ధ చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖ లోతప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం,పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.



# మహిళా రిజర్వేషన్లపై ఏకపక్ష ధోరణి

**ప్రతిపక్షాల విజ్ఞప్తులను విస్మరించిన ప్రభుత్వం : కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విమర్శ**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10 ఆంధ్ర ప్రగతి**

మహిళా రిజర్వేషన్‌పై మోడీ ప్రభుత్వం 'ఏకపక్ష' ధోరణి ప్రదర్శిస్తూ ప్రతిపక్షాల విజ్ఞప్తులను విస్మరించిందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విమర్శించింది. శుక్రవారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన, ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించారు. అలాగే అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై తీర్మానాన్ని సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదించింది**మిగతా 2లో...**

# వైకాపా కుట్రలను తిప్పికొట్టండి

మొదటిపేజీ తరువాయి

వస్తుందని స్పష్టంగా హెచ్చరించారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగా ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదని చెప్పారు. ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సీఎం మంత్రులకు పలు సూచనలు చేశారు. 'జలధార' పథకం గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. పాస్‌బుక్స్ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు, సంబంధిత మంత్రులు నెలకు కనీసం నాలుగు సార్లు ప్రాంతాల వారీగా పర్యటించాలని ఆదేశించారు. 'సూర్య ఘర్' పథకంపై మరింత దృష్టి పెట్టాలని, వచ్చే ఏడాదితో ముగియనున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని మంత్రులకు నిర్దేశిరచారు.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మహిళా బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. ఇక, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఏపీ కేబినెట్‌లో లీకుల అంశంపై సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. కేబినెట్ సమావేశం ప్రారంభమైనా అజెండా మాత్రం మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని కేబినెట్‌కు వచ్చే వీలు ఉండేదన్నారు. దీంతో వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు రాను రాను మరింత ఉపయోగపడాల్సింది పోయి క్లిష్టంగా మారుతున్నాయంటూ అధికారుల తీరను ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కార్యదర్శులు గతంలో స్జబెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ ఎక్కువ సంఖ్యలో డీమ్డ్ యూనివర్సిటీలను అందుబాటు లోకి తీసుకురావాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని సీఎం తెలిపారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ప్రతి మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నాలుగు కార్యక్రమాల్లో అయినా పాల్గొనాలని ఆదేశించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం నిర్దేశిరచారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రాజెక్టులకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అదేవిధంగా, క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మూడు సంస్థల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇక జోనల్ వ్యవస్థకు సంబంధించి కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. రాష్ట్ర పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకునే చర్యలపై అధికారులు వివరాలు సమర్పించారు. పలు పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయంలో కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చింది. మొత్తం 60కి పైగా ఎజెండా అంశాలను పరిశీలించిన కేబినెట్, వాటిలో ముఖ్యమైన వాటికి ఆమోదం తెలిపింది. మొత్తానికి, ఈ కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు నిర్ణయాలతో ముగిసిందని అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం రానుంది. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్‌ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, టీసీఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదంఇచ్చారు.

## రాయలసీమ ప్రాజెక్టులను చంపేసిన వైకాపా

మొదటిపేజీ తరువాయి

బొత్సకు భయంతో కూడిన బాధ వచ్చిందని మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. బొత్స అన్న మాటలు గుర్తు చేయడం అచ్చెన్నాయుడి తప్పా అని ప్రశ్నించారు. వైఎస్ మరణం, బాబాయ్ వివేకా హత్యలో అంతిమ లబ్దిదారు జగన్ కాదా అని వ్యాఖ్యానించారు.రాజకీయ అవసరాల కోసమే రాయలసీమను వైసీపీ వాడుకుంటుందని పయ్యావుల కేశవ్ విమర్శించారు. వైసీపీ హయాంలో రాయలసీమకు ఎంత ఖర్చు పెట్టారో ఆ పార్టీ నేతలు చెప్పాలన్నారు. రాయలసీమ మేలు కోసం వైసీపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాయలసీమపై పెట్టిన ఖర్చుపై చర్చకు సిద్ధమా? అంటూ ఆ పార్టీ నేతలకు ఆయన సవాల్ విసిరారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ పెడతామని చెప్పాం.. తాము చేస్తామని స్పష్టం చేశారు. రాయలసీమ లిఫ్ట్‌పై స్టే విధిస్తే.. వైసీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. వివాదాలు సృష్టించేందుకే వైసీపీ-బీఆర్ఎస్ కుట్రలని మండిపడ్డారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే ఏం చేశారంటూ ఆ పార్టీ నేతలను ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ నిలదీశారు. వైసీపీ మొసలి కన్నీరును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడి వ్యాఖ్యల్లో తప్పేముందని వైసీపీ నేతలను మంత్రి పయ్యావుల ప్రశ్నించారు. గతంలో బొత్స చెప్పిన మాటలనే మళ్లీ అచ్చెన్నాయుడు గుర్తు చేశారన్నారు. మీరు చెప్పిన మాటలనే గుర్తు చేస్తే.. ఉలుకెందుకు? అంటూ బొత్సను నిలదీశారు. జగన్ నైజం చూసి బొత్స సత్యనారాయణ బాధపడక ఏం చేస్తారు? అంటూ ఎద్దేవా చేశారు. భయంతో బొత్సకు బాధ కలిగిందేమో? అని వ్యంగ్యంగా అన్నారు. గుండెపోటు నుంచి గొడ్డలిపోటు వరకు.. తండ్రి మరణం నుంచి బాబాయ్ హత్య వరకు.. తల్లి విజయలక్ష్మి నుంచి చెల్లి షర్మిల ఆస్తి తగాదా వరకు.. జగన్ నైజమేంటో ప్రజలకు స్పష్టంగా తెలుసునని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# సవాళ్లను స్వీకరించండి

మొదటిపేజీ తరువాయి

గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.షార్ట్‌కట్‌లతో నిండిన ప్రస్తుత ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని లోకేశ్ అన్నారు. "కేవలం ఏం నేర్చుకున్నారన్నది కాకుండా, ఎలా ఆలోచిస్తున్నారనేదే అత్యంత ముఖ్యం. ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ప్రవర్తిస్తామో అదే మన నిజమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది" అని విద్యార్థులకు హితవు పలికారు. లక్ష్య సాధనలో పట్టుదలతో ఉండాలని, ఎదురయ్యే అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు.ఈ పర్యటన సందర్భంగా మంత్రి లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోందని, త్వరలోనే ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖపట్నం అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోందని వెల్లడించారు. గ్రీన్‌వుడ్ హై స్కూల్ అంతర్జాతీయ స్థాయిలో పౌరులను (గ్లోబల్ సిటిజన్స్) తయారు చేస్తుండటం గర్వకారణమని ఆయన ప్రశంసించారు.అంతకుముందు, పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్కూల్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్ట్ గ్యాలరీ, తరగతి గదులను సందర్శించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన లోకేశ్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.వివరాల్లోకి వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అమరావతి అవినీతి గని

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న అమరావతి రాజధాని 40 ఏళ్లయినా పూర్తికాదని, అదొక అసాధ్యమైన ఆలోచన అని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ, అక్కడ కేవలం భవనాలు మాత్రమే ఉన్నాయి తప్ప జనం లేరని, అమరావతి పరిస్థితి కూడా అలాగే మారుతుందని ఆయన హెచ్చరించారు.

కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల కోసం విలాసవంతమైన బంగ్లాలు కడుతున్నారే తప్ప, సామాన్య ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయిలో రేట్లు పెట్టి... ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోటికి ప్రజలు ఎందుకు వస్తారని సజ్జల ప్రశ్నించారు.చంద్రబాబు అమరావతిని ఒక 'గ్రోత్ ఇంజిన్'లా కాకుండా, తన అవినీతికి తరగని గనిలా, అక్షయపాత్రలా వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం భావితరాలకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. తన సొంత సంస్థ హెరిటేజ్‌ను నడిపేటప్పుడు తీసుకునే ఆర్థిక జాగ్రత్తలను, రాజధాని నిర్వహణలో చంద్రబాబు ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. అప్పుల ద్వారా వచ్చే నిధులతో ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చంద్రబాబు సూటిగా సమాధానం చెప్పలేకపోతున్నారని, ఆయన మాటల్లో డొల్లతనం కనిపిస్తోందని విమర్శించారు

# అందరి దృష్టి చర్చలపైనే

మొదటిపేజీ తరువాయి

ఇరానీయులు చిత్తశుద్ధితో చర్చలకు సిద్ధంగా ఉంటే, మేము కూడా తప్పకుండా స్వాగతిస్తాం," అని అన్నారు. మరోవైపు వాన్స్ ప్రకటన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ ట్రూత్‌లో "ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పున్ణప్రారంభం" అని పోస్ట్ చేయడం గమనార్హం.

### ఆంక్షల నడుమ ఇస్లామాబాద్

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో నేడు అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. దీంతో అందరి దృష్టి ఇస్లామాబాద్‌పై నిలిచింది. అక్కడ ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీసులు, మిలిటరీ, స్పెషల్ సర్వీస్ కమాండోలు నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ముఖ్య రహదారులు, ప్రభుత్వ భవనాల వద్ద భద్రతా దళాలు గస్తీ కాస్తున్నాయి. నగరంలోని రెడ్ జోన్ ప్రాంతం కఠిన భద్రత కింద ఉంది.

### సాధారణ వాహనాలకు నో ఎంట్రీ

పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హౌటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలు ఉన్న రెడ్ జోన్ ప్రాంతంలోని రహదారులు సాధారణ వాహనాలకు పూర్తిగా మూసివేశారు. పోలీసు బలగాలు నగరవ్యాప్తంగా చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశాయి. అధికార ప్రతినిధుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు. ఈ కీలక చర్చల ముందు ప్రజల ప్రజల రాకపోకలు తగ్గించేందుకు గురువారం, శుక్రవారం రోజులను ప్రభుత్వ సెలవులుగా ప్రకటించారు. పాఠశాలలు, దుకాణాలు మూతబడ్డాయి. కొద్ది చోట్ల మాత్రమే పరిమిత కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

### లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు

ఒకవైపు చర్చల ప్రకియ జరుగుతుండగా, మరోవైపు ఇజ్రాయిల్ బరితెగించి లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తుంది. దక్షిణ లెబనాన్‌లో కార్‌వాష్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించారు. పలువురికి గాయాలయ్యాయి. అయితే అమెరికా-ఇరాన్ మధ్య కీలక చర్చల నేపథ్యంలో ఇజ్రాయిల్ తీరు ఆందోళనను కలిగిస్తున్నది. వారాల కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన తర్వాత కూడా ఇజ్రాయిల్ దాడులకు తెగబడటం చర్చలకు ఆటంకంగా మారుతుందని పలుదేశాలు ఆందోళనవ్యక్తం చేస్తున్నాయి. అయితే ప్రతినిధి బృందం ఇంకా పాకిస్తాన్‌కు బయలుదేరలేదు. కాల్పుల విరమణ అనేది లెబనాన్ విషయంలో వర్తించదని ఇజ్రాయిల్ వాదిస్తోంది. కాగా అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ తన బృందంతో హంగేరీ నుంచి ఇప్పటికే ఇస్లామాబాద్‌కు బయలుదేరారు.

### భద్రత కట్టుదిట్టం

పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మోహిసిన్ నక్వీ.. అమెరికా రాయబారికి పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 30 మంది సభ్యులతో కూడిన అమెరికా బృందం ఇస్లామాబాద్‌కు చేరుకుని భద్రతా ఏర్పాట్లను పరిశీలిచింది. అయితే ఈ కీలక సమావేశాన్ని నిర్వహించే హోటల్ సెరీనా వద్ద భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హోటల్‌ను ఉన్నతస్థాయి దౌత్య సమావేశాలకు వేదికగా ఉపయోగిస్తారు. కాగా వైట్ హౌస్ మాజీ ప్రెస్ సెక్రెటరీ ఎరీ ఫ్లీషెర్ ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే గగనతల భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ 1ఎల్-78 ట్యాంకర్లు, సి-130 విమానాలను మోహరించింది. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ ప్రాంతం మీదుగా పాకిస్తాన్ యుద్ధ విమానాలు గస్తీ కాస్తున్నాయి. ఇవి ఇరాన్ ప్రతినిధి బృందం ప్రయాణించే విమానానికి భద్రత కల్పిస్తున్నాయి.

# మహిళా రిజర్వేషన్లపై ఏకపక్ష ధోరణి

మొదటిపేజీ తరువాయి

. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి, పార్లమెంటరీ సీట్ల సంఖ్యను పెంచాలన్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ ప్రతిపాదిత చర్య ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని విమర్శించారు. ఈ విషయంలో ప్రతిపక్షం ఐక్యంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు." ఈ సమావేశం అనంతరం, ప్రతిపక్షంలోని సహచరులందరితోనూ ఈ అంశాలపై చర్చించి ఓ సమిష్టి వ్యూహాన్ని రూపొందిస్తాం. అంతా ఐక్యంగా ముందుకు సాగుతాం" అని ఖర్గే అన్నారు. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరగనున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయంపై కూడా ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రయోజనాలు, రాజకీయ లబ్ది కోసమే ఇవన్నీ జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "మోడీ ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ది పొందాలనే ఉద్దేశంతోనే పార్లమెంట్ సమావేశాలను నిర్వహిస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లును అత్యంత తొందరగా ఆమోదింపజేయాలని ఆసక్తిగా ఉంది" అని ఖర్గే విమర్శించారు. ప్రతిపాదిత సవరణలు దేశ ఎన్నికల వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. కావున వాటిపై 'లోతైన చర్చ' అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."మాకు ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం, 2029 ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వం కోరుకుంటోంది. లోక్‌సభలోని సీట్ల సంఖ్యను 543 నుంచి 816కు పెంచాలని కూడా భావిస్తోంది" అని ఖర్గే అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేస్తూ "ఈ పునర్విభజన ప్రతిపాదన తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. అందువల్ల, పునర్విభజనపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ ముగిసిన తరువాత అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్న ప్రతిపక్షాల అభ్యర్థనను ప్రభుత్వం పట్టించుకోలేదని ఖర్గే ఆరోపించారు. "ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే.ఈ ఉల్లంఘనలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుంటుందని మేము ఆశించడం లేదు" అని అన్నారు. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీసిఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖ్ పాల్గొని ఈ సమావేశంలో తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

## న్యాయ శాఖ పటిష్టత కోసం చర్యలు.

మొదటిపేజీ తరువాయి

ఇందులో భాగంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం పై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు.ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం,లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి, మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్య కుమార్ లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## మావిగన్ పై ఐదేళ్లలో ఎందుకు మాట్లాడలేదు

మొదటిపేజీ తరువాయి

ఇదే వైకాపా సిద్దాంతమని మండిపడ్డారు. నిండు సభలో విజయమ్మను అవమానించినందుకు బొత్స ఎంత ఏడ్చినా తక్కువేనన్నారు. మావిగన్.. ఎంతసేపూ గన్‌లు, గొడ్డల్లేనా? ఐదేళ్లలో రాజధాని కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చారు. ఇప్పుడు అమరావతి వద్దట.. మావిగన్ పెడతారట. పులివెందుల పేరు బదులు 'అవి గొడ్డలి' అని పెట్టండి. మావిగన్ అద్భుత ఆలోచనైతే.. ఐదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు అమలు చేయలేదు. మావిగన్‌కు తక్కువ ఖర్చు అయితే.. మూడు రాజధానులు ఎందుకన్నారు? జగన్ ఐదేళ్లు నిద్రపోయారా? మావిగన్ మీద మా వైఖరి అడుగుతున్నారు. ఎవరైనా జోక్ వింటే బిగ్గరగా నవ్వుతారు.. మా నవ్వే 'మావిగన్' మీదున్న అర్థం. అమరావతిపై కాంగ్రెస్ వైఖరి ఇప్పటికే స్పష్టంగా చెప్పాం. పార్లమెంట్‌లోనూ మద్దతిచ్చాం. అమరావతి కట్టడం కేంద్రం బాధ్యత అని చెప్పాం. విభజన హామీలు నెరవేర్చాలని చెప్పాం. అమరావతికి పూర్తి మద్దతిస్తున్నాం. నన్ను కూటమికి దత్తపుత్రిక అంటున్నారు. పచ్చకామెర్లు వచ్చినవాడికి లోకమంతా పచ్చగా ఉంటుందట. జగన్ మాత్రం భాజపాకి దత్తపుత్రుడు. ఆయన మోదీతో అక్రమ పొత్తు పెట్టుకున్నారు. వీళ్లు అలా చేశారు కాబట్టి.. అందరూ అలాగే ఉంటారనుకోవడం పొరపాటు. మేం వైఎస్సార్ ఐడియాలజీకి నిజమైన వారసులం. వైఎస్సార్ పేరు వాడుకునే హక్కు ఎవరికీ లేదు. ప్రజల పక్షాన పోరాటం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు.

## జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు.

**..అందరికీ తాగునీరు అందాలి.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 10:**
జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను హెచ్చరించారు.
శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో తాగునీరు,పారిశుధ్య మిషన్ సమావేశం మరియు తాగునీటి సమస్యలు, పారిశుధ్యం అంశాల పై అన్ని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా మరియు పారిశుధ్య నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారుల మీద చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గిపోవడం, బోర్‌వెల్స్ తరచుగా పాడైపోవడం వల్ల త్రాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. తుంగభద్ర డ్యామ్ నుండి జనవరి 20 వరకు నీటిని విడుదల చేయడం వల్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నింపుకున్నామని, మార్చి 20 వ తేదీ నుండి మళ్లీ నీటి విడుదల ప్రారంభమైనందున, ట్యాంకులను నింపుతున్నామని, ఆగస్టు చివరి వరకు నీటి కొరత ఉండదని భావిస్తున్నామన్నారు. నీటి వనరులు ఉన్నాయి, అయినా నీటి సమస్యలు ఎందుకు వస్తున్నాయని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి, గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.
ప్రతి ప్రాంతానికి సమానంగా నీటి సరఫరా జరగాలన్నారు. ఎక్కడైనా పక్షపాతం లేదా నిర్లక్ష్యం జరిగితే సహించబోనని కలెక్టర్ తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి గ్రామాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయని, క్రమం తప్పకుండా వాటిని పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు. అదే విధంగా తాను పర్యటన కు వెళ్ళిన సమయంలో కొన్ని చోట్ల చెత్త శుభ్రం చేస్తున్నట్లు, కొన్ని చోట్ల చెత్తను అలాగే వదిలేస్తున్నట్లు గమనించామని, అలాగే కొన్ని చోట్ల తాగు నీరు వృథా అవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకే ప్రాంతం నుండి తాగునీరు, పారిశుధ్య నిర్వహణకు సంబంధించి పత్రికల్లో ప్రతికూల వార్తలు రెండు మూడు సార్లు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బందికి మూడు ఇంక్రిమెంట్లు నిలిపివేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు సరఫరా చేయడం లేదని ప్రతికూల వార్తలు రాకూడదన్నారు. అదే విధంగా లీకేజీ సమస్యలు కూడా ఉండకూడదన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ ప్రాథమిక బాధ్యత పారిశుధ్యం శుభ్రంగా ఉంచడం త్రాగునీరు సమస్యలు లేకుండా చూసుకోవడం అని, పై నుండి కింది స్థాయి సిబ్బంది వరకు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
నిన్న తాను కోసిగి కి క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్ళిన సమయంలో ఒక మైనర్ అమ్మాయికి బాల్య వివాహం చేస్తున్నారని విషయం తెలిసి, ఆ పెళ్లిని ఆపగలిగానన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, సిడిపిఓ లు, వారి స్టాఫ్ ఏం చేస్తున్నారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు? బాల్య వివాహాలను ఆపాల్సిన బాధ్యత అందరి మీద ఉంటుందన్నారు.
నీటి సరఫరాలో వివక్ష చూపకూడదని, అందరికీ సమానంగా మరియు న్యాయంగా నీరు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఒక ఏరియాలో ఎక్కువ, మరొక ఏరియాలో తక్కువ నీరు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి ఒక్కరికీ సమానంగా నీరు ఇవ్వాలన్నారు. ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్ లపై క్లోరినేషన్ ఎప్పుడు చేశారు, బ్లీచింగ్ ఎప్పుడూ చేశారనే తేదీలు ఖచ్చితంగా రాయాలని, ఏమీ రాయకుండా ఖాళీగా ఉన్న బోర్డులు కనిపిస్తే, దీనికి బాధ్యులైన వారి మీద చర్యలు ఉంటాయన్నారు.
మున్సిపల్ ఏరియాల్లో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ సెగ్రిగేషన్ పనులు బాగానే జరుగుతున్నాయన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాలకి వచ్చేసరికి తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా చేయడం కనపడడం లేదన్నారు. ప్రతి ఒక్క గాభోజ షెడ్ సరిగ్గా పనిచేసి వర్మీ కంపోస్ట్‌గా మార్చే పనులు జరగాలని డిపివో ను ఆదేశించారు.అనంతరం పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై మండల వారీగా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పైప్లైన్ ల లీకేజీ లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ సీఈఓ రమణా రెడ్డి, డిఎమ్హెచ్ఓ డా.కామేశ్వర రావు, ఐసిడిఎస్ పిడి విజయ, డిపిఓ భాస్కర్, డి ఆర్ డి ఎ పిడి రమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక అభివృద్ధికి వేగం..

# ఉపాధి అవకాశాల విస్తరణకు కలెక్టర్ పిలుపు

**..రెన్యూవబుల్ ప్రాజెక్టులపై సమీక్ష భూసేకరణ సమస్యల పరిష్కారానికి చర్యలు.**

**..జిల్లాలో పరిశ్రమల వాటా పెంపుపై దృష్టి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు.**

**..పారదర్శక భూమి కేటాయింపులు సింగిల్ డెస్క్ విధానానికి ప్రాధాన్యం.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 10:**
జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసి, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వివిధ ప్రాజెక్టుల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిపాలనా మరియు స్థానిక సమస్యలపై సమీక్ష చేపట్టారు. సోలార్, విండ్, సీబీజీ, బిఇఎస్ఎస్ వంటి మొత్తం 17 ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీవోలు ప్రాజెక్టుల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం జనాభాలో 78 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లా జిడిపిలో పారిశ్రామిక రంగం వాటా కేవలం 19 శాతం మాత్రమే ఉండగా, వ్యవసాయం 42 శాతం, సేవా రంగం 39 శాతం వాటాను కలిగి ఉన్నాయని వివరించారు. ప్రత్యేకంగా సెకీ ప్రాజెక్ట్ పురోగతిపై సమీక్షిస్తూ, కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామంలో ఇప్పటికే 38.10 ఎకరాల భూమి కేటాయించగా, అదనంగా అవసరమైన 9.20 ఎకరాల్లో 6.32 ఎకరాలకు సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూమికి సంబంధించి తహశీల్దార్ కార్యాలయం నుండి ఎలియనేషన్ లెటర్‌ను త్వరితగతిన పొందాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల భాగంగా గ్రీన్‌కో సంస్థ కటికవానికుంట ప్రాంతంలో సుమారు 4,118 ఎకరాల భూమిని కోరగా, భూమి లభ్యతపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓను ఆదేశించారు. అదేవిధంగా ఏపీ జెన్‌కోకు అవసరమైన రహదారి సౌకర్యం కోసం ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించారు.
జిల్లాలో పారిశ్రామిక అవసరాల కోసం దాదాపు 6,000 ఎకరాల భూమి అవసరమని అంచనా వేయగా, ప్రస్తుతం సుమారు 5,800 ఎకరాలు అవసరమని గుర్తించారు. గోరుగట్ల, తట్టెకొండపల్లి, చెన్నకేశవపల్లి ప్రాంతాల్లో సుమారు 7,500 ఎకరాల భూమిని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఈ భూములు ప్రభుత్వమా, అసైన్డ్ భూములా అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూమి కేటాయింపుల ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ, ఒక వారంలో ఫిజిబిలిటీ రిపోర్ట్, తదుపరి వారంలో ప్రతిపాదనలు సమర్పించి మొత్తం ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించారు. రీ-సర్వేలో 5 శాతం వరకు వ్యత్యాసాలను అనుమతిస్తూ, అంతకంటే ఎక్కువ ఉంటే కేసు వారీగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేట్ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ శాఖ నుంచి క్లియరెన్స్ తీసుకోవాలని సూచించారు. భూమి మార్పిడి ప్రక్రియలో సింగిల్ డెస్క్ విధానాన్ని అనుసరించాలని, దేవదాయ శాఖ భూములకు సంబంధించిన వివరాలను కమిషనర్ కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఏపీఐఐసీ భూమి సమస్యలను జోనల్ స్థాయిలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలాగే రీ-సర్వే రికార్డులు మరియు పాత రికార్డుల మధ్య వ్యత్యాసాలను సరిచేసి వెబ్‌ల్యాండ్ 2.0లో నవీకరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.
ఏఎంపి ఎన్ హెచ్ ప్రాజెక్ట్ కింద 1,360 ఎకరాల భూమిలో 507 ఎకరాల రిజిస్ట్రేషన్ పూర్తైందని, మిగిలిన 850 ఎకరాలు త్వరలో పూర్తవనున్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్లను రెండు రోజుల్లో పూర్తి చేసి, నెడ్‌క్యాప్ పేరుమీద నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇద్దంపల్లి, అమడగుంట్ల గ్రామాల్లో మ్యూటేషన్లు పెండింగ్‌లో ఉండగా, వెబ్‌ల్యాండ్ 2.0లో సాంకేతిక సమస్యల కారణంగా సుమారు 30 ఎకరాల ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలిపారు. మొత్తం 9,645 ఎకరాల భూమిని హ్యాండోవర్ చేయగా, అందులో 70 శాతం భూమికి హద్దులు నిర్ణయించినట్లు వెల్లడించారు. భూమి సర్వేలు, బౌండరీల నిర్ధారణ, 580 ఎకరాల భూమి అప్పగింతలో ఉన్న జాప్యం, ఎలక్ట్రికల్ లైన్ల సమన్వయం, పనికిరాని భూముల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎర్రగుడి ప్రాంతంలో కోఆర్డినేట్ల వ్యత్యాసాలను సరిచేసి సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన భూమి కేటాయింపులు, పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి పెట్టుబడులను ఆకర్షించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను పటిష్ఠంగా అమలు చేస్తున్నాం.

**..జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్, 10:**
కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అజయ్ కుమార్ సాహు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎకనామిక్ ఆఫీసర్ రూబల్ కుమార్, డ్వామా పిడి సూర్యనారాయణ మూర్తి, హౌసింగ్ పిడి శ్రీహరి గోపాల్, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, ఎల్డిఎం రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి అమలు చేస్తున్న పథకాలైన హౌసింగ్, ఉపాధి హామీ పనులు, పంచాయతీ రాజ్ పనులు, నైపుణ్య అభివృద్ధి పనుల పరిశీలన నిమిత్తం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు రావడం జరిగిందన్నారు. వారు జిల్లాలోని బనగానపల్లె, రుద్రవరం, కొలిమిగుండ్ల, నంద్యాలలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. హౌసింగ్, ఉపాధి హామీ పనులు ఒకే ఐడి వచ్చేలా చూడాలని, చాబోలులో గ్రామంలో సాగి పథకం క్రింద ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ పనులతో మిగతా పనులు కూడా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా డిసిల్టింగ్, ఫీల్డ్ ఛానెల్స్ పనులు కూడా పూర్తి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రణాళికల వారీగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అజయ్ కుమార్ సాహు మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలు, ఎస్పీఓలకు వారి వీధుల పట్ల మంచి అవగాహన కలిగి ఉన్నారని ఏ రాష్ట్రంలో కూడా ఇంతటి సమన్వయంతో పనులు జరగట్లేదని జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

# ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లండి.

**..సమాజం మార్పులో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ కీలక పాత్ర.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 10:**
ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లలో ఉందని, వారు సమాజానికి సరైన దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజయ గాథల తో పాటు బాల్య వివాహాలు, అక్షరాస్యత పెంపు, బహిరంగ మల విసర్జన నిర్మూలన లాంటి సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని, దీని ద్వారా భూమి సారవంతం పెరిగి మంచి దిగుబడులు సాధ్యమవుతాయని వివరించారు. ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న పనులను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని, సమాజ అభివృద్ధి, విద్యా విస్తరణ, సామాజిక సమస్యల పరిష్కారంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.సమావేశంలో సమాచార శాఖ డిడి జయమ్మ పాల్గొన్నారు.

# చెత్తా శుద్దీకరణ త్వరితగతిన పూర్తి చేయాలి.

**జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారి డా. ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ ఏప్రిల్ 10:**
నగరంలోని ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణలో భాగంగా గార్గేయపురం డంప్‌యార్డులో నిల్వ ఉన్న లెగసీ వ్యర్థాలను బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా త్వరితగతిన శుద్ధి చేసి, భూభాగాన్ని పునర్వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి దేవనగర్‌లోని మురుగు శుద్ధి కేంద్రం (ఎస్టీపీ), గార్గేయపురం డంప్యార్డును పరిశీలించారు.గార్గేయపురం డంప్‌యార్డులో సుమారు 15 ఎకరాల్లో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాలపై బయో మైనింగ్, బయో రిమీడియేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి, రికవర్డ్ మెటీరియల్ను శాస్త్రీయంగా వర్గీకరించి వినియోగించాలన్నారు. తదనంతరం వేస్ట్ టు ఎనర్జీ యూనిట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్‌ఎఫ్) ప్లాంట్ల స్థాపనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అమలు దశకు తీసుకెళ్లాలని ఆదేశించారు. దేవనగర్ వద్ద మురుగు శుద్ధి కేంద్రం నిర్వహణను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) ప్రకారం మెరుగుపరచాలని, ట్రీటెడ్ వాటర్ నాణ్యతను నిరంతరం మానిటరింగ్ చేయాలని సూచించారు. అదేవిధంగా, సంబంధిత మౌలిక వసతుల నిర్వహణ బాధ్యతలను త్వరలో పబ్లిక్ హెల్త్ విభాగం నుండి కార్పొరేషన్‌కు బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.
కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ గురప్ప, డిఈ యూ.వెంకటేశ్వర్లు, ఏఈ నాగశేష, నగరపాలక ఎస్ఈ రమణమూర్తి, కార్యదర్శి నాగరాజు, ఎంఈలు గిరిరాజ్, డిఈఈలు పవన్, ఏఈ వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

# సర్వభూత దయయే తపస్సు

**..డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే. - కరిమద్దెలలో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**





**ఆంధ్ర ప్రగతి గడివేముల/ కరిమద్దెల ఏప్రిల్ 10:** సర్వభూతములపై దయకలిగి ఉండడమే నిజమైన తపస్సని, భూతదయ పరమాత్మ్రుష్టమైన మార్గమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గడివేముల మండలం, కరిమద్దెల గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. గత మూడు రోజులు కె. సిద్ధారెడ్డి శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవతంపై చేసిన ప్రవచనాలు,తెలుగు నాగరాజుబృందం చేసిన భజనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక భక్త సమాజ సభ్యులు ఎ. సోమసుందర రెడ్డి, యం. శివారెడ్డి, కె.శివారెడ్డి, కె. నారాయణ, ఎస్.శేఖర్ రెడ్డి, గుండం వెంకట రెడ్డి, జి. జయమ్మ, పూజారి కరణం జ్యోతి, పి. రామలక్ష్మమ్మ, అరుణ లక్ష్మి, ఎ. ఎల్లమ్మ, కుమ్మరి వెంకట సుబ్బమ్మ, లక్ష్మిదేవి, సుబ్బలక్ష్మన్న, హరిత, శోభ, చెన్నమ్మపాటు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి.

**..విధులకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు.**

**..ఆన్‌లైన్ హాజరు లోపాలపై షోకాజ్ నోటీసులు.**

**..జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 10:**
సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు సేవలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం బేతంచెర్ల మండలం ఆర్. కొత్తపల్లె గ్రామంలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించారు. విధులకు హాజరుకాని పంచాయతీ గ్రేడ్-5 సిబ్బంది మరియు వీఆర్వోపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై కలెక్టర్ వివరణ కోరారు. సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలించి, వాటి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. సచివాలయ ఆవరణలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పబ్లిక్ పర్సెప్షన్ సర్వేలో సాధించిన పురోగతి, ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు, వాటిపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారా లేదా అనే అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రీసర్వేకు సంబంధించి వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో లేరని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన సచివాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రజా ఫిర్యాదుల విభాగం పనితీరును కూడా కలెక్టర్ సమీక్షించారు.

## 200 యూనిట్ల ఉచిత విద్యుత్ నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలి..!

### -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పిలుపు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 10:**
ఆంధ్రరాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20నెలల పాలనలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఇందులో భాగంగానే సెలూన్ షాపులకు 150 యూనిట్లు ఉచిత విద్యుత్తును 200 యూనిట్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసిందనిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. శుక్రవారం కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ఉమ్మడి కర్నూలు జిల్లా నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. నంద్యాలలో సెలూన్ షాపులను సందర్శించి 200 యూనిట్లు ఉచితం విద్యుత్ అమలవుతున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా విలేకరులతో కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అధోగతిపాలైందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పుల ఊబిలో చిక్కుకున్న రాష్ట్రాన్ని ప్రగతి వైపు పరుగులు పెట్టిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తెలియజేశారు. ఇందులో భాగంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజలు సైతం సంతృప్తిగా ఉన్నారని వెల్లడించారు. 2026- 27 బడ్జెట్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. గత బడ్జెట్లో కన్నా ఈ ఏడాది నిధులు శాతం పెంచడం హర్షిణీయమన్నారు. వీటిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తూ తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతుందని చెప్పారు. దీనికి తోడు దేవాలయాల పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు ఒకరికి అవకాశం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. అంతేకాకుండా దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేలు వేతనం ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ఆదరణ 3 కింద అధునాతన పరికరాలను త్వరలో అందించనుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బీసీల రక్షణకు కూటమి ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురానుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా డైరెక్టర్ పాలకవీటి విజయ్ కుమార్ దుర్వేసి వెంకటేశ్వర్లు, యం.రామ మద్దయ్య, శీనయ్య, చెరువుపల్లి బాబు, యం.విజయభాస్కర్, పెద్ద రాంపుల్లయ్య, చిన్న రాంపుల్లయ్య, మాయలూరి వెంకట్, కానాల శేఖర్, తిరుపతయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించండి.

**తరచూ నేరాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోండి.**

**రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించండి.**

**కేసుల చేదనలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 36 మందిని అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేత.**

**జిల్లా పోలీసు అధికారులుతో నేర సమీక్షా సమావేశం నిర్వహించిన.ఎస్పీ సునీల్ షోరాణ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఏప్రిల్ 10:**
నంద్యాల జిల్లాలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ జిల్లా పోలీసు అదికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి సమీక్షా నిర్వహించి నేరనియంత్రణకు, పెండింగ్ కేసుల దర్యాప్తు, నేరస్థులను గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని (సుధర్శన్, గాండీవ్, మొదలగు వాటిని ఉపయోగించుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదిదారులతో గౌరవప్రదంగా మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయండి. కేసుల దర్యాప్తు, పరిష్కారం, ప్రాపర్టీ నేరాలలో ముద్దాయిల అరెస్ట్, బందోబస్తు విధులు మొదలగు వాటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 36 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ల వారీగా యూ ఐ కేసులు తగ్గించుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు.
మహిళల భద్రత, సైబర్ క్రైమ్, శాంతి భద్రతల పరిరక్షణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సమీక్షించారు. వాటి పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలవాటు పడిన నేరస్తుల కదలికలపై నిఘా ఉంచండి. మరియు ప్రాపర్టీ నేరాలు చేసిన వారిపై అవసరమైతే షీట్స్ ఓపెన్ చెయ్యండి. బీట్లు, పికెట్స్ ఏర్పాటు చేసుకొని అధికారులు తరుచుగా బీట్ చెక్ చేస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా మరియు భౌతిక దాడులు జరుగకుండా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే రోడ్డు రవాణా సంస్థ, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో నియంత్రణ చర్యలు చేపట్టాలి.
మహిళలు భద్రత కొరకు వారు ఎక్కువగా సంచరించు ప్రదేశాలలో ప్రత్యేక దృష్టి ఉంచి పెట్రోలింగ్ పెంచడంతో పాటు నిఘా కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు పాత సీసీ కెమెరాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచండి.
కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్ కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావలి ఆల్ఫోన్స్ , రామంజి నాయక్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా హరిహర పుత్ర అయ్యప్ప స్వామి
# విగ్రహ జలాధివాసం.

**నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట.. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 10:**
నంద్యాల పట్టణంలోని 38వ వార్డు వైయస్సార్ నగర్లో నూతనంగా నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన 10వ తేదీన శాస్త్రోక్తంగా హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాలకు జలాధివాసం గావించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 38వ వార్డు టీడీపీ అధ్యక్షుడు, ఇంచార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ తూర్పునాటి సావిత్రమ్మ, టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

**నేటి కార్యక్రమం:**
ఉత్సవాల్లో రెండో రోజైన శనివారం (11వ తేదీ) ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. ఈ పవిత్ర కార్యం లో భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

## స్వాతంత్ర్య సమరయోధుల, శాస్త్రవేత్తల సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.**



**ఆంధ్ర ప్రగతి డోన్ ఏప్రిల్ 10:**
డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో స్వాతంత్ర్య సమరయోధులు మొరార్జీ దేశాయి వర్ధంతి సందర్భంగా మరియు హోమియోపతీ పితామహుడు శామ్యూల్ హానిమన్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘణంగా నివాళులు అర్పించారు.వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.
1)శ్రీ మొరార్జీ దేశాయ్ గుజరాత్ రాష్ట్రంలో బల్సార్ జిల్లా మగదేవా గ్రామంలో 29-02-1896 లో జన్మించారు.మన దేశ స్వాతంత్ర్య సమరయోధులు మన మాజీ ప్రధాన మంత్రిగా పని చేసిన మహనీయులు. సివిల్ సర్వీస్ లో పనిచేసి 1930లో బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమంలో చేరి గాంధీజీ అనుచరుడుగా స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక సార్లు జైలు జీవితం గడిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత మన భారత ప్రభుత్వంలో అనేక పదవులు అలంకరించి సేవలందించారు. మన భారత ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించింది. ఈయన 1995 ఏప్రిల్ 10న స్వర్గస్తులైనారు. మన దేశం కోసం అహర్నిషలు కష్టపడి మనకు స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులను అనుక్షణం స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. 2) హోమియోపతీ పితామహుడు శామ్యూల్ హానిమన్ 10-4-1755 న జన్మించారు.ఈయన జర్మనీకి చెందిన వైద్యుడు.వైద్య చరిత్రలో ప్రత్యామ్నాయ వైద్యమైన హోమియో విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. అమూల్యమైన హోమియో వైద్య విధానాన్ని భవిష్యత్ తరాలకు అందించడం కోసం తమ శరీరాలనే ప్రయోగశాలలుగా చేసుకొని మందులను తమపైనే ప్రయోగించుకొని రుజువుపరచి గ్రంథస్తం చేసిన డాక్టర్ హానిమన్, ఆయన శిష్యులను మానవజాతి ఎన్నటికీ మరువదు. డాక్టర్ హానిమన్ తన 88 వ ఏట 1843 జులై 2 వ తేదీన తుదిశ్వాస వదిలారు. సమాజానికి సేవలు అందించిన మహనీయులను అనుక్షణం స్మరించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

## మహానంది దేవస్థానం పాలకమండలి పై
# కొనసాగుతున్న సస్పెన్స్..!



**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 10:**
మహానంది దేవస్థానం పాలక మండలి ఏర్పాటు వివాదం కొన..సాగుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి మహానంది దేవస్థానం ఆలయ పాలకమండలి పై పలువురు కన్నేసారని తెలుస్తుంది. ఇందుకు సంబంధించి పాలక మండలి చైర్మన్, సభ్యులుగా కొన్ని పేర్లు బయటకు వచ్చాయి. మహానంది, బండి ఆత్మకూరు, నంద్యాల ప్రాంతానికి చెందిన కొందరి పేర్లు బహిరంగంగానే ప్రచారం జరిగింది. పార్టీలో సఖ్యత లేకపోవడంతో వారు కాదు.. వీరు.. వీరు.. కాదు.. వారు అనే ధోరణిలో స్థానిక ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కూటమి పార్టీలో కూడా కొందరు మా వర్గానికి చెందిన వ్యక్తి మహానంది దేవస్థానం చైర్మన్ గిరి వరించబోతుంది అన్న ప్రచార గత కొంతకాలం నుంచి ఎవరికి వారు ముమ్మరంగా సాగిస్తున్నట్లు తెలుస్తుంది. మొదట మహానంది మండలానికి చెందిన రెండు పేర్లు చైర్మన్ గిరి కోసం పరిశీలన చేపట్టినట్లు ప్రచారం. ఇందులో భాగంగా అసమ్మతి చల్లార్చి ఓ వర్గానికి చైర్మన్ పదవి మరో వర్గానికి పాలకమండలిలో అధిక భాగం సభ్యులుగా నియమించుకునే విధంగా చర్చలు కొనసాగినట్లు తెలుస్తుంది. అంతా ప్రశాంతంగా జరిగిపోతుందన్న ఆశావాహులు దేవాదాయ ధర్మాదాయ శాఖకు దరఖాస్తులు ఓ ప్రజా ప్రతినిధి ఆదేశాల మేరకు దరఖాస్తు చేసినట్లు తెలుస్తుంది. రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన పలు దేవాలయాలకు పాలక మండళ్లను ఏర్పాటు చేసినట్లుగానే మహానంది దేవస్థానానికి కూడా పాలకమండలి ఏర్పాటవుతుందని ఆ ఆ..నందంలో ఉండగా కూటమి ప్రభుత్వంలో ఒక కుదుపు కుదిపినట్లుగా నంద్యాలకు చెందిన ఓ వ్యక్తి పేరు మహానంది దేవస్థానం చైర్మన్ గా ప్రచారంలోనికి రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత కొంతకాలం నుంచి ఆ వ్యక్తి పేరు ప్రచారంలో ఉన్న తర్వాత ఆ వ్యక్తి తాను మహానంది దేవస్థానానికి చైర్మన్ రేస్ లో లేనని ఆ పదవి తనకు సరిపోదని ప్రచారం చేసుకుంటున్నారు అని తెలుస్తుంది. ఏది ఏమైనా రాష్ట్రంలోని పలు ఆలయాలకు పాలక మండళ్ల ఏర్పాటు అవుతున్న మహానంది దేవస్థానం పాలకమండలి నియామకం మాత్రం సుప్త వస్తలో ఉండడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొందరు ప్రజాప్రతినిధుల మూడు ముక్కలాటలో భాగంగా మహానంది దేవస్థానం పాలక మండలి ఏర్పాటు ఇప్పట్లో జరిగే అవకాశం లేనట్లు తెలుస్తుంది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో దీని ప్రభావం మహానంది, బండి ఆత్మకూరు నంద్యాల తదితర ప్రాంతాల్లో చూపే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న వర్గ విభేదాలే మహానంది దేవస్థానం పాలకమండలి ఏర్పాటుపై తీవ్ర ప్రభావం చూపుతున్న ప్రసారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2029 నాటికి మహానంది మండలం నంద్యాల రూరల్ లేదా అర్బన్ నియోజకవర్గానికి మారుతుందని దానిపై పట్టు కోసం కొందరు, ఎలాగూ పోతుంది కదా మనకెందుకులే అని ఒక వర్గం మిన్న కున్నట్లు ప్రచారం.

## గ్రామాభివృద్ధి, పార్టీ బలోపేతమే లక్ష్యం

### : ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



**ఆంధ్ర ప్రగతి వేల్పనూరు ఏప్రిల్ 10:**
గ్రామాల అభివృద్ధి, తెలుగుదేశం పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమఅభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి గారు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం వేల్పనూరు నందు వివిధ శాఖల అధికారులు మరియు పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. అధికారులు, కూటమి నాయకత్వం సమిష్టిగా సంక్షేమం, అభివృద్ధి పనులను వేగవంతం చెయ్యాలని సూచించారు. గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం కూటమి అభ్యర్థులు గెలుపొందేలా కృషి చేయాలని సూచించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపకల్పన చేయాలని ఎమ్మెల్యే గారు తెలిపారు. అనంతరం పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ స్థాయి ఎన్నికల వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## రేషన్ దుకాణాలు సచివాలయాల్లో జెసి ఆకస్మిక తనిఖీలు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల ఏప్రిల్ 10:** మండల కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలలో సచివాలయాలలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తికేయ శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తానికిలు చేశారు. తహసిల్దార్ ఐ విజయశ్రీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర కుమార్ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాలలోని ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రైస్ మరియు సుగర్ ఇతర చౌక దుకాణంలోని సరుకుల వివరాల గురించి డీలర్లను అడిగి తెలుసుకున్నారు క్రమం తప్పకుండా సమయానుకూలంగా సరుకుల పంపిణీ వేస్తున్నారా లేదా అని రేషన్ కార్డు దారులతో ఆరా తీశారు.కొన్ని రేషన్ దుకాణాలలో కేవలం బియ్యం మాత్రమే నిల్వ ఉండడం చెక్కర లేకపోవడం పట్ల రేషన్ డీలర్ల పై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలోని సిబ్బంది ఉద్యోగులు విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు వ్యసనాలకు ఆవు లేకుండా సక్రమంగా పౌర సేవలు అందించాలని ఆదేశించారు. సిరివెళ్లలో కొనసాగుతున్న భూ సర్వే రికార్డులను పరిశీలించి ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రిసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

## వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ మరో ఏడాది పొడిగింపు.

**ఆంధ్ర ప్రగతి అమరావతి,ఏప్రిల్ 10:**రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్(జీనూ)ను ప్రవేశపెట్టడం జరిగింది.దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది.మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 11 ఏప్రిల్ 2026

# ప్రజలందరి సమానత్వం కోసం పోరాడిన యుగపురుషుడు మహాత్మ జ్యోతిబాపూలే..!

**-కుల వివక్ష వ్యతిరేక ఉద్యమకారుడు. -మహిళా విద్యా ప్రదాత. -భారతదేశ తొలి తరం సామాజిక తత్వవేత్త జ్యోతిబా మహాత్మ పూలే.**

## నేడే మహాత్మ జ్యోతిరావు పూలే 200 వ జయంతి.

**ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా ఏప్రిల్ 10:** భారతదేశంలో యుగ పురుషుడైన సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11 న దేశవ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతుంది. భారతీయ సామాజిక సంఘసంస్కర్త మహిళ విద్యా ప్రదాత, కుల వివక్ష వ్యతిరేక ఉద్యమకారుడు, ఆలోచనాపరుడు, కార్యకర్త, ఆయన తన జీవితాన్ని కుల ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా పోరాడటానికి మరియు అణగారిన వర్గాల కోసం, మహిళల కోసం, మరియు నిమ్న కులాల వారి హక్కుల కోసం వాదించడానికి తన జీవితాన్ని అంకితం చేసిన జ్యోతిరావు మహాత్మా పూలే 1827 వ సంవత్సరంలో ఏప్రిల్ 11 న మహారాష్ట్ర ,పూణేలో జన్మించారు. ఆధునిక భారత దేశ సమాజంలో అందరికంటే గొప్ప శూద్రుడు హిందూ సమాజంలో అగ్రకులాల వారి క్రింద బానిసలుగా బతుకుతున్న కింది కులాల వారిలో తమ బానిసత్వం పట్ల ఆయన చైతన్యం రగిలించారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించుటకు భారతదేశానికి అతి ముఖ్యమైన మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రకటించుకున్నారు. అయితే మహాత్మ పూలే "దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం, రక్తనాళాలలాంటి" వాళ్లు అని చెప్పాడు మహాత్మ పూలే. ఆయన ఒక భారతీయ గొప్ప సంఘసంస్కర్త, రచయిత, పేద కార్మికులు, మహిళలతో సహా ప్రజలందరికీ సమానత్వం కోసం పోరాడిన యోధుడు. ఆయన హిందూ కుల వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవస్థ ప్రజలను వారు పుట్టిన సామాజిక వర్గాన్ని బట్టి వేరుచేసి వర్గీకరిస్తుంది. కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్న శూద్ర కులాలు అంటే చేతి వృత్తుల వారు మరియు కూలీలు అదేవిధంగా నేడు షెడ్యూల్డ్ కులాలు లేదా దళితులు అనే పిలువబడుతున్న సమూహాలు ఎదుర్కొంటున్న వివక్షను మహాత్మ పూలే తీవ్రంగా ఆ రోజుల్లో ఖండించారు. భారతదేశంలో అగ్రవర్ణ బ్రాహ్మణులకు ఎవరు ఆధీనంలో ఉండని ఒక నూతన సామాజిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని మైన ఆకాంక్షతో ఆయన ఒక ఉద్యమానికి నాయకత్వం వహించారు. మహాత్మ పూలే మహిళల హక్కుల కోసం కూడా పోరాడారు. సామాజిక మార్పు తీసుకురావడానికి విద్య అత్యవసరం అని నమ్మి ఆయన బాలికల కోసం మరియు నిమ్న కులాల పిల్లల కోసం పాఠశాలలను స్థాపించారు. భారతదేశంలోని సాంప్రదాయ సామాజిక వర్గాలలో అత్యంత నిమ్న మైన శూద్ర సామాజిక వర్గంలోని మాలి కులానికి చెందిన వారు. పూలే చిన్నతనములో ప్రతిభావంతుడైన విద్యార్థి , కానీ మాలి పిల్లలలో ఉన్నత విద్యను అభ్యసించడం అసాధారణం మాలి కుటుంబాలకు చెందిన అనేక ఇతర పిల్లలలాగే మహాత్మ పూలే కూడా చిన్న వయసులోనే తన చదువును మానేసి స్వయంగా పనిచేయడం ప్రారంభించారు. అయితే మహాత్మ పూలే వారి ఇంటి ప్రక్కల ఉన్న పొరుగువారిలో ఒకరు, తన కుమారుడుని పాఠశాలకు పంపమని అతని తండ్రిని ఒప్పించడంలో సహాయపడ్డారు. ఆనేపథ్యంలో 1840 వ దర్శకములో మహాత్మ పూలే పూణేలో స్కాటిస్ క్రైస్తవ మిషనరీలు నడుపుతున్న ఒక మాధ్యమిక పాఠశాలలో చదివాడు. జ్యోతిబాపూలే అక్కడ తెలుసుకున్న చారిత్రక ఉద్యమాలు మరియు ఆలోచనపరుల నుండి సంపూర్ణ ప్రేరణ పొందాడు. వారిలో 1791వ సంవత్సరంలో థామస్ పైనే రచించినటువంటి రైట్స్ ఆఫ్ మ్యాన్ (మానవ హక్కులు) ఈ పుస్తకము చాలా ప్రభావితం చేసినది. అదేవిధంగా అమెరికాలోని స్వాతంత్ర్య మరియు బానిసత్వ వ్యతిరేక ఉద్యమాల నుండి చాలా విషయాలు నేర్చుకున్నారు.

గౌతమ బుద్ధున్ని మరియు యోగి కవి అయిన కబీర్ రచనలు ఆయన యొక్క బోధనలు నుండి కూడా ప్రేరణ పొందాడు. ప్రజలందరి సమానత్వం కోసం పోరాడిన యుగపురుషుడు, మహాత్మ జ్యోతిబాపూలే ప్రజలను తన ఇంటికి నిరంతరము ఆహ్వానించేవారు.

### విద్య ద్వారా సమానత్వం,చదువే అన్ని సమస్యలకు పరిష్కారం అన్న మహోన్నతుడు పూలే

1848 వ సంవత్సరంలో మహాత్మ పూలే ఒక అగ్రవర్ణ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన తన స్నేహితుని




వివాహానికి ఆహ్వానించబడ్డాడు. పెళ్ళికొడుకు బంధువులు ఆయన నిమ్న కులానికి చెందిన వాడు కనుక ఆయన నేపథ్యాన్ని చూసి ఎగతాళి చేస్తూ అవమానించడంతో దాంతో ఆయన
ఆవివాహ వేడుక నుండి తిరిగి వెళ్లిపోయారు. అప్పుడు ఈ సంఘటన ద్వారా కుల వ్యవస్థలోని అన్యాయాల పట్ల ఆయన కళ్ళు తెరిపించింది ఈ వ్యవస్థ పట్ల తిరుగుబాటు చేయుటకు కఠినమైన అంకుటిత దీక్షతో తిరుగుబాటుకు పూనుకున్నాడు. ఈ కుల వ్యవస్థ అనేది విదేశీ శక్తులు భారతదేశంలో ప్రవేశపెట్టిన ఒక పరాయి వ్యవస్థ అని మహాత్మ పూలే వాదించారు. ఆ రోజుల్లో బాలికలు అభ్యసించడం అత్యంత అరుదు. భారతదేశంలో బాలికలు చదువుకు దూరంగా ఉన్న కాలంలో మొట్టమొదటిసారిగా 1848 వ సంవత్సరములో ఆయన పూనే లో నిమ్న కులాల బాలికల కోసం ఒక మార్గదర్శక పాఠశాలను ప్రారంభించారు. ఆయన తన భార్య సావిత్రిబాయి పూలే కు ఇంట్లోనే విద్యను స్వయంగా తానే నేర్పించారు. మరియు ఆమె ఆ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా మారింది ఆ తర్వాత కొన్ని సంవత్సరాలలో పూలే దంపతులు బాలికల కోసం మరిన్ని పాఠశాలలను స్థాపించడం జరిగింది.

### సామాజిక సమానత్వం కోసం సత్యాన్వేషణ

సామాజిక సంస్కర్త సాంస్కృతిక విప్లవోద్యమకారుడు మహాత్మ పూలే. ఆధునిక కాలంలో దేశంలో సామాజిక వర్గాల నుంచి సంస్కరణ ఉద్యమాలను నడిపించిన వారిలో ఆధ్యుడు జ్యోతిబాపూలే , నడిపిన ఉద్యమానికి మాలి, కున్బీల తర్వాత ఎక్కువగా ఆయనకు అండగా నిలబడిన వారు తెలుగువారు, వారిలో రామయ్య, వెంకయ్య, అయ్యవారు, జాయకరడి లింగూ లాంటి, అనేకమంది తెలుగువారు సత్యశోధకు సమాజ్ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. అదేవిధంగా "దీనబంధు" పత్రిక నిర్వహించడానికి ముద్రణా యంత్రాన్ని 1874 సంవత్సరంలో సమకూర్చినవారు మన తెలుగు వారే చాలామంది ఆదిలాబాద్ జిల్లా నుండి మరాఠీలో స్థిరపడిన వారు అనేక మంది తెలుగువారు ఉన్నారు, నిమ్న కులాల ప్రజల కోసం, అలాగే మహర్లు, మరియు మాంగ్ ల కోసం మహాత్మ పూలే దంపతులు సనాతన బ్రాహ్మణుల నుండి గణనీయమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. వారు సామాజిక యథాతథ స్థితిని దెబ్బతీస్తున్నారని వారిని నిందించారు అయినప్పటికీ పూలే మరియు సావిత్రిబాయి పూలే సామాజిక ఆర్థిక మరియు లింగ సమానత్వం కోసం తమ పనిని కొనసాగించుకుంటూ సమాజంలోకి వెళ్లారు. అదేవిధంగా బాల్యవివాహాలను వ్యతిరేకించారు. వితంతువులకు పునర్వివాహం చేసుకొనే హక్కును సమర్థించారు, దీనిని అగ్రవర్ణ హిందువులు తిరస్కరించారు. అదేవిధంగా పూలే దంపతులు గర్భవతులైన వితంతువుల కోసం మరి ముఖ్యంగా బ్రాహ్మణుల కోసం ఒక గృహాన్ని, అలాగే వారి పిల్లల సంక్షేమం కోసం ఒక అనాథ ఆశ్రమాన్ని ప్రారంభించినారు. పూలే మరియు సావిత్రిబాయి పూలే వీరు ఇరువురు ఈ పిల్లలలో ఒకరిని దత్తత తీసుకున్నారు. 1873 వ సంవత్సరంలో సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, ఐక్యతను సాధించడానికి "సత్యశోధకు సమాజ్" అంటే సత్య అన్వేశుకుల సమాజం కోసం విలువలతో జీవిస్తారని సంస్కరణ సమాజాన్ని స్థాపించారు. సామాజిక సమానత్వమును ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. శూద్రులను మరియు నిమ్న వారిని ఏకం చేసి వారందరినీ ఉన్నత స్థితికి తీసుకురావడం కొరకు మరియు కుల వ్యవస్థ వల్ల కలిగే సామాజిక-ఆర్థిక అసమానతలను తొలగించడం సత్యశోధకు సమాజ్ యొక్క లక్ష్యం ఈ సమాజం విద్య యొక్క ప్రాముఖ్యతను కూడా నొక్కి చెప్పింది, అలాగే బ్రాహ్మణ పురోహితులు లేకుండా వివాహాలు చేసుకోవడానికి ప్రజలను ప్రోత్సహించింది. సామాజిక వర్గంతో సంబంధం లేకుండా సత్యశోధకు సమాజంలో చేరడానికి ఎవరికైనా స్వాగతం అని పూలే స్పష్టం చేశారు. బ్రాహ్మణ ఆధిపత్య కుల వ్యవస్థలో అణచివేతను పంచుకున్న ప్రజలను ఏకం చేయడం కోసం పూలే యొక్క ప్రాథమిక ఉద్దేశ్యాలలో ప్రధానమైనది. సత్యశోధకు సమాజంలో ప్రధానంగా గ్రామ నేతల కులాల వారు ఉన్నప్పటికీ, సభ్యులలో బ్రాహ్మణులు మరియు వివిధ మత సాంప్రదాయాలకు చెందిన వారు కూడా ఉన్నారు. పూలే తన వ్యక్తిగత ఆనాడు బావిని కూడా ప్రజలందరి ఉపయోగ కోసం తెరిచిఉంచారు, ఇది ఆయన స్వాగతానికి ఆనాటి సమాజంలో ప్రతీకగా నిలిచింది.

### మహాత్మ జ్యోతిబాపూలే రచనలలో "గులాంగిరి" చారిత్రాత్మకమైన గ్రంథము

సామాజిక సమానత్వం స్వేచ్ఛ ఆత్మగౌరవం ఉద్యమాలకు ఆధ్యుడై ఐక్యమత్య సమాజం కోసం అనునిత్యం మహాత్మ జ్యోతిబాపూలే శ్రమించాడు. స్త్రీ పురుష లింగ వివక్ష, కుల బానిసత్వం పై అలుపెరుగని పోరాటం చేసిన శిఖరం. సామాజిక రుగ్మతలను అసమానతులను నిర్మూలించడానికి "గులాంగిరి"ఒక చారిత్రాత్మకమైన రచన చేశారు అంటే బానిస బతుకులు, పూణే సత్యశోధక సమాజ నివేదిక, చత్రపతి శివాజీ, తృతీయరత్న,రాజ్ భోంస్లేయాంఛ,విద్యాకాథాతిల్, బ్రాహ్మణ్




పంతోజి,మొదలైన రచనలు చేశారు. అదేవిధంగా వితంతు మహిళా అనాథ శిశువులకై "సేవాసదనం" స్థాపించారు. బహుజనుల సమాజాన్ని బానిసలు చేసిన దాస్య భావాల బోధకులను ఎదిరించి వర్ణ వ్యవస్థ పై తిరుగులేని బావుట ఎగరేసిన తిరుగుబాటుదారుడు. భారతదేశంలో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనీకుడు మహాత్మ జ్యోతిబాపూలే రైతుల , కార్మికుల సమస్యల కోసం బాధలు వివరించేందుకు 1877 వ సంవత్సరంలో సత్యశోధన సమాజం తరఫున "దీనబంధు" అనే పత్రికను స్థాపించాడు. 1853 వ సంవత్సరంలో మహిళల కోసం, అనాథ శిశువుల కోసం అనేక సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. 1868 వ సంవత్సరంలో తన ఇంటి దగ్గర ఉన్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి అనుమతిచ్చారు. 1869 సంవత్సరంలో "పౌరోహిత్యం యొక్క బండారం" అనే పుస్తక రచన చేశాడు. 1880 వ సంవత్సరంలో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమ పితామహుడు లోఖాండేతో కలిసి రైతులను, కార్మికులను, తదితరులను సంఘటితం చేసేందుకు ప్రయత్నించాడు. 1873 వ సంవత్సరంలో గులాంగిరి (బానిసత్వం) అనే పుస్తకమును ప్రచురించాడు. ఈ గ్రంథంలో బ్రాహ్మణీయ అమానుష సూత్రాలను, శూద్రులు అతిశూద్రులపై మనువాద బ్రాహ్మణుల క్రూర వైఖరిని పూలే తులనాత్మకంగా పరిశీలించాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించాడు.

### కుల వివక్ష లేని సమాజం కోసం, సమ సమాజ స్థాపన కోసం నిరంతరము పరితపించిన పూలే

1883 వ సంవత్సరములో సేద్యగాడి చెర్నాకోల పుస్తక రచన పూర్తి చేశారు ఏప్రిల్ నెలలో బొంబాయిలో జరిగిన ఒక సమావేశంలో పుస్తక సారాంశాన్ని వినిపించాడు 1885 సంవత్సరంలో సత్యసారాంశం ప్రచురించారు ఇదే సమయంలో ప్రచురితమైన తన హెచ్చరిక అంటే వార్నింగ్ అనే బుక్ లేట్ లో ప్రార్థన సమాజం, బ్రహ్మ సమాజం తదితర బ్రాహ్మణీయ సంస్థలమీద తీవ్రమైన విమర్శలు గుప్పించాడు. 1891లో మహాత్మాపూలే రచించిన సార్వజనిక్ సత్య ధర్మ పుస్తకము ఆయన మరణానంతరము ప్రచురితమైంది. ఇందులో చాతుర్వర్ణ వ్యవస్థను దుయబటాడ్డాడు, మద్యపానాన్ని వ్యతిరేకించాడు. 1888 వ సంవత్సరంలో కుల మత వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికి సభ్యత్వం కల్పించేవారు మనువాద బ్రాహ్మణులు వేదాలను పవిత్రంగా భావించడాని మహాత్మపూలే వ్యతిరేకించాడు. విగ్రహారాధనను కూడా ఖండించాడు. 1891 సంవత్సరంలో ఆయన ప్రచురించిన సార్వజనిక్ ధర్మ పుస్తక్ మత సాంఘిక విషయాలపై పూలే గారి యొక్క అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేస్తుంది. స్త్రీ పురుషుల మధ్య లింగ వివక్షను కూడా విమర్శించాడు. సమానత్వం, ఐక్యమత్యంతో కూడిన సమాజాన్ని కాంక్షించారు.
ఆనాటి అజ్ఞాన సమాజంలో విపరీతంగా బాల్య వివాహాలు సర్వసాధారణంగా జరిగేవి. ముసలివారికిచ్చి పెళ్లిళ్లు చేయడం వల్ల చిన్నతనంలోనే మహిళలు పెద్ద సంఖ్యలో వితంతువులయ్యేవారు. ఇలాంటి వితంతువులు మళ్లీ వివాహం చేసుకోవడానికి ఆనాటి సమాజము అంగీకరించేది కాదు కట్టుబాట్లతో తీవ్రంగా అణిచివేసేది. అందువల్ల వితంతువులు పునర్వివాహాలు చేసుకునే విధంగా వారిని గురించి జ్యోతిబాపూలే ప్రజలలో చైతన్యము తీసుకొచ్చాడు. 1864 వ సంవత్సరంలో "బాలహత్య ప్రతిబంధక్ గృహ"స్థాపించి వితంతువులైన మహిళా గర్భిణీ స్త్రీలకు కొండంత అండగా నిలిచాడు. దేశంలోనే ఇటువంటి సేవ కేంద్రం స్థాపించడం దేశంలోనే మొదటిది. 1872 వ సంవత్సరంలో ఈ కేంద్రంలో జన్మించిన ఒక బ్రాహ్మణ వితంతువు కుమారుడిని జ్యోతిబాపూలే దత్తత తీసుకున్నారు. ఆనాటి అజ్ఞాన సమాజంలో విపరీతంగా బాల్య వివాహాలు సర్వసాధారణంగా జరిగేవి. ముసలివారికిచ్చి పెళ్లిళ్లు చేయడం వల్ల చిన్నతనంలోనే మహిళలు పెద్ద సంఖ్యలో వితంతువులయ్యేవారు. ఇలాంటి వితంతువులు మళ్లీ వివాహం చేసుకోవడానికి ఆనాటి సమాజము అంగీకరించేది కాదు కట్టుబాట్లతో తీవ్రంగా అణిచివేసేది. అందువల్ల వితంతు పునర్వివాహాల
ఆనాటి చీకటి రోజులలో శూద్రులను బ్రాహ్మణుల చెర నుండి కాపాడటమే మహాత్మ పూలే నడిపిన ఉద్యమ ముఖ్య ఉద్దేశం ఈ సమస్త సభ్యులు పురోహితుల అవసరం లేకుండానే దేవుని ఆనాడు పూజించేవారు. కనుక మహాత్మ పూలే రచించిన మహోత్తర గ్రంథం "గులాంగిరి"సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజల కొరకు మహిళల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేసిన ఆయనకు "మహాత్మా" బిరుదు ఇచ్చారు. ఆయన దీర్ఘకాలిక జబ్బుతో బాధపడుతూ నిరంతరం సమసమాజ స్థాపన కోసం పరితపించిన జ్యోతిబాపూలే 1890 సంవత్సరంలో నవంబర్ 28 వ తారీఖున కన్నుమూశాడు. నేడు ఆయన జయంతి సందర్భంగా ఆ మహానుభావుడికి ఘన నివాళులు అర్పిస్తూ బహుజన సమాజం ఆయన అడుగుజాడల్లో నడుస్తారని రాజ్యాధికార విజయాలు పొందుతారని కోరుకుందాం.



డా.జి.బాలస్వామి
న్యాయవాది మరియు
ఫ్రీలాన్స్ జర్నలిస్టు